క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాశిబుగ్గ, పోచమ్మ మైదాన్, చార్‌బౌళి, నిజాంపుర, మండిబజార్, ఎల్.బీ.నగర్, గోవిందరాజుల గుట్ట, లక్ష్మీపూర్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఏసీపీగా వెంకటేశ్ బాధ్యతల స్వీకరణ



ఏసీపీ వెంకటేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ రమేశ్

మామునూరు : మామునూరు నూతన ఏసీపీగా ఎన్.వెంకటేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం ఇక్కడ ఏసీపీగా పనిచేసిన తిరుపతి హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యాడు. బదిలీపై వచ్చిన వెంకటేశ్ ఏసీపీగా ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. యువతలో చట్టపరమైన అవగాహన పెంచడమే ప్రధాన కర్తవ్యం అని ఏసీపీ తెలిపారు. ఏసీపీని మామునూరు సీఐ రమేశ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

శ్మశాన వాటికలో శివుడి విగ్రహావిష్కరణ



శివుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ మునిగాల సరోజన, అభివృద్ధి కమిటీ సభ్యులు

మడికొండ: మడికొండ 46వ డివిజన్ హిందు శ్మశాన వాటికలో శుక్రవారం కార్పొరేటర్ మునిగాల సరోజన విగ్రహాన్ని ఆవిష్కరించారు. శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, రిటైర్డ్ లెక్చరర్ పెట్టం సాంబయ్య వారి తల్లిదండ్రుల స్మారకార్థం శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ శ్మశానం అనేది జీవితంలో చివరి స్థానం అందుకే శివుడు అక్కడ ఉంటాడని తెలిపారు. మరణించిన వారి ఆత్మలకు మోక్షమార్గం చూపిస్తాడని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకుడు మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, దర్గా సొసైటీ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, శంకర్, వినోద్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

గోరక్ష చట్టాలను అమలు చేయాలి

న్యూశాయంపేట : గోరక్ష చట్టాలు అమలు చేయాలని, గోవును వెంటనే జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరుతూ శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు దేశీ గో వంశ రక్షణ సమితి, గోరక్ష విభాగం, విశ్వహిందూ పరిషత్ వరంగల్ మహానగర్ శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందించారు. వినతి పత్రం అందించిన వారిలో మహానగర్ ప్రముఖ్ నాగరాజు, వెలగందుల నంగునూరి, రాజు,శ్రీధర్, ఓంకుమార్, సునంద్‌కుమార్, నాగరాజు, రామానుజమ్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, ధనుష్, రోహిత్ సీత కిషన్ రవికుమార్ శరవన్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య



వెంకటేశ్వర్లు (ఫైల్)

ఖిలా వరంగల్ : భార్య మందలింపుతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం సాయంత్రం రామకిష్టాపురం సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌జిల్లా గీసుగొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన ఎర్రం వెంకటేశ్వర్లు,శ్రీదేవి దంపతులు ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఎర్రం వెంకటేశ్వర్లు (54) హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల వ్యాపారం సాగక.. తెచ్చిన అప్పులు కట్టే పరిస్థితి కనిపించటం లేదు. హోటల్‌లోని కౌంటర్‌లో డబ్బులు తీసుకొని మద్యం తాగుతూ మద్యానికి బానిసయ్యాడు. దీనిపై శుక్రవారం మధ్యాహ్నం అతని భార్య శ్రీదేవి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన వెంకటేశ్వర్లు రామకిష్టాపురం మామిడి తోటకు వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా..

తొలగించని నీటి మళ్లింపు కట్ట

- సమీపిస్తున్న వర్షాకాలం
- బ్రిడ్జి నిర్మాణానికి వాడిన సెంట్రింగ్‌ను తొలగించని దుస్థితి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్



రాజాజీనగర్ వద్ద నాలాలో వరదనీటికి అడ్డుగా నీటి మళ్లింపు మట్టికట్ట. తొలగించని సెంట్రింగ్ (బాక్స్‌లో)

హన్మకొండ : కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీర్ల విధులపై అలసత్వం, బాధ్యతారాహిత్యం వెరసి భారీ వర్షాలు పడి వరదొస్తే కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదముందని హనుమకొండలోని రాజాజీనగర్, విద్యానగర్, క్రాంతినగర్, రాంనగర్ వాసులు మొత్తుకుంటున్నారు. వడ్డెపల్లి చెరువు మత్తడి నుంచి 100 అడుగుల రోడ్డు, సమ్మయ్యనగర్, రాజాజీనగర్, నయీంనగర్ మీదుగా దిగువకు వెళ్లే నాలాలో వరదనీరు సులువుగా వెళ్లేందుకు నయీంనగర్, రాజాజీనగర్‌లో నూతనంగా బ్రిడ్జిలు నిర్మించారు. నయీంనగర్ బ్రిడ్జిని యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం పూర్తి చేశారు. రాజాజీనగర్ బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగింది. రూ.2.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టిన రాజాజీనగర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయి రెండు నెలలు దాటుతున్న ఇప్పటి వరకు బ్రిడ్జికి వాడిన సెంట్రింగ్ తొలగించలేదు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో నాలాలో నీటి మళ్లింపు కోసం తాత్కాలికంగా వేసిన మట్టికట్టను తొలగించలేదు.

వరదనీటికి అడ్డుగా ఉన్న సెంట్రింగ్ పోల్స్

దీంతో నీటి మళ్లింపు కోసం వేసిన మట్టికట్టతో పాటు సెంట్రింగ్ పోల్స్ వరద నీటికి అడ్డుగా ఉన్నాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తయి రెండు నెలలు దాటినా నాలాలో నీరు వెళ్లేలా అడ్డంకులు తొలగించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీర్లు చోద్యం చూస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఇప్పటికే అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో నాలాలో వరద నీరు పెరుగుతుందని వర్షాకాలం భారీ వర్షాలు కురిస్తే బ్రిడ్జిలో నుంచి పూర్తిగా వరద నీరు సులువుగా వెళ్లకపోవడంతో బ్యాక్ వాటర్ పెరిగి కాలనీలు ముంపునకు గుర య్యే ప్రమాదముందని ఈ ప్రాంత కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. మహానగర పాలక సంస్థ అధికారులు స్పందించి నీటి మళ్లింపు కట్టతో పాటు సెంట్రింగ్ తొలగించి వరద నీరు వెళ్లేలా నాలాను పూర్తిగా శుభ్రం చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బందులు పెడుతున్న కాంట్రాక్టర్

కాగా మరో వైపు తనకు రెండు నెలలకు పైగా సెంట్రింగ్ మెటీరియల్ ఇవ్వకుండా కాంట్రాక్టర్ ఇబ్బందులు పెడుతున్నాడని సెంట్రింగ్ సరఫరా చేసిన కంచర్ల ఎలీషా మహానగర పాలక సంస్థ కాజీపేట డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. 8 నెలల క్రితం సెంట్రింగ్ సరఫరా చేశానని, బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా తనకు తిరిగి కాంట్రాక్టర్ సెంట్రింగ్ ఇవ్వడం లేదని, దీంతో తనకు రూ.15 లక్షల నష్టం కలిగిందని ఫిర్యాదులో సెంట్రింగ్ మేస్త్రీ ఎలీషా తెలిపాడు. తాను సెంట్రింగ్ అద్దెకు ఇచ్చుకుంటూ జీవనోపాధి పొందుతున్నానని రెండు నెలలకు పైగా తనకు సెంట్రింగ్ ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నానని, కాంట్రాక్టర్ నుంచి తన సెంట్రింగ్ తనకు ఇప్పించాలని ఎలీషా కోరాడు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

రామన్నపేట : నగరంలోని ఖిలావరంగల్, మండిబజార్, దేశాయిపేట, కాశిబుగ్గ, కరీమాబాద్, ఉర్సు ప్రాంతాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను శుక్రవారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అందజేశారు. శుక్రవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు సీఎంఆర్ఎఫ్ సహాయంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బస్వరాజు శిరీష శ్రీమాన్, గుండేటి నరేంద్రకుమార్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేశ్, మాజీ కార్పొరేటర్లు జన్ను అరుణ్, తత్తరి లక్ష్మణ్, బిల్లా శ్రీకాంత్, దామెర సర్వేశం, రవి, సంపత్, రాజు, తాహేర్, కరాటే ప్రభాకర్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



నిత్యావసర సరుకులు అందుకున్న మహిళలతో సంస్థ ప్రతినిధులు

మడికొండ: మహిళలు ఆర్థికంగా ఎదగడానికి మా వంతు సహాయంగా నిత్యావసర సరుకులు, కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని ఫ్రెండ్ బీయింగ్ ఏ హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తెలిపారు. వేవా సాఫ్ట్‌వేర్ సంస్థ సహకారంతో ఫ్రెండ్ బీయింగ్ ఏ హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా గ్రామానికి చెందిన పది మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, పది మంది ఒంటరి మహిళలకు కుట్టుమిషన్లను శుక్రవారం పంపిణీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ మహిళలు సొంతంగా బతకడానికి కుట్టుమిషన్లు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, లోటస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్ సంస్థ డైరెక్టర్ బోగి మహేందర్, స్థానికులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జ్యోతి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జ్యోతి

హసన్‌పర్తి : ఈనెల 26, 27వ తేదీల్లో మండల కేంద్రంలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జ్యోతి పిలుపునిచ్చారు. మండలంలోని వంగపహాడ్‌లో జరిగిన సభకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం పేరు మీద ధనస్వామ్యం, భూస్వామ్యం రాజ్యమేలుతోందని ధ్వజమెత్తారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు ఆర్థిక, సాంఘిక, రాజకీయ, కాంట్రాక్ట్ రంగాల్లో 42 రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 26న జరిగే జిల్లా మహాసభ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. సీపీఐ నాయకుడు దోమ రాకేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి, సీనియర్ నాయకులు రాజమౌళి, దాసు, మంద జ్యోతి, శ్యాం, భారతి, రజిత పాల్గొన్నారు.

ఇంగ్లిష్ సబ్జెక్ట్ తొలగింపు సరికాదు

- ఆంగ్ల విభాగం పాఠ్యప్రణాళిక అధ్యక్షురాలు పి.నిర్మల



సమావేశంలో పాల్గొన్న పాఠ్యప్రణాళిక అధ్యక్షురాలు నిర్మల

కేయూ క్యాంపస్ : యూనివర్సిటీల పరిధిలోని అన్ని యాజమాన్యాల్లోని డిగ్రీ కళాశాలల్లో ఫైనలియర్‌లో ఇంగ్లిష్ భాష సబ్జెక్టు బోధన తొలగింపు సరికాదని అదేవిధంగా క్రెడిట్స్ 20 నుంచి 12కు తగ్గించటాన్ని వ్యతిరేకిస్తున్నామని దీనిపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి, యూజీసీ పునరాలోచించాలని కాకతీయ యూనివర్సిటీ ఆంగ్ల విభాగం పాఠ్యప్రణాళిక అధ్యక్షురాలు పి. నిర్మల కోరారు. శుక్రవారం యూనివర్సిటీలోని ఆంగ్ల విభాగంలో యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల ఆంగ్ల విభాగం అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. కొందరు అధ్యాపకులు ఆన్‌లైన్‌లోనూ పాల్గొన్నారు. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా డిగ్రీ ఫైనలియర్‌లోని ఆంగ్లభాష బోధనను తొలగిస్తున్నట్లు ఇటీవల హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ఆంగ్ల అధ్యాపకుల సమావేశం వ్యతరేకించింది. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థిలో భాషానైపుణ్యాలపై చాలా ఉంటుందన్నారు. విదేశీ యూనివర్సిటీలు ఆంగ్ల భాషలో 20 క్రెడిట్స్ తప్పనిసరి చేశాయని 20 నుంచి 12కు క్రెడిట్స్ తగ్గించటంతో విదేశీ ఉన్నత విద్యావకాశాలపై ప్రభావం ఉంటుందని అధ్యాపకుల సమావేశం అభిప్రాయపడింది. ఈ నిర్ణయంపై పునరాలోచించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలిని, యూజీసీని కోరుతూ ఈ సమావేశం తీర్మానించిందని నిర్మల తెలిపారు. సమావేశంలో కేయూ ఆంగ్ల విభాగం అధిపతి డాక్టర్ దీపాజ్యోతి, బీఓఎస్ సభ్యులు డాక్టర్ మేఘనారావు, రామ్‌భాస్కర్, పి.శారద, కేయూ పాలకమండలి సభ్యులు నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేటగిరీలుగా లోతట్టు ప్రాంతాలు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- 4,9 డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి

హన్మకొండ చౌరస్తా : వర్షాకాలం సమీపిస్తుండడంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా ఎంపిక చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలకు పూనుకున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. 4వ డివిజన్ పరిధిలోని యాదవనగర్, లోటస్‌కాలనీ, 9వ డివిజన్‌లోని సుధానగర్ ప్రాంతాల్లో రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు నగరంలో అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. వాటికి శాశ్వత పరిష్కారం చూపడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపే నాలా ఆక్రమణల తొలగింపు, నయీంనగర్ నాలా పునరుద్ధరణ పనులను చేపట్టిన విషయం తెలసిందే అన్నారు. పేదల కాలనీలు ముంపునకు గురికాకుండా ప్రజలకు సురక్షితమైన జీవనాన్ని అందించడమే తమ లక్ష్యంగా రేవంత్‌రెడ్డి సర్కార్ పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా త్వరలోనే ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బల్దియా మేయర్ గుండు సుధారాణి, 4, 9 డివిజన్ల కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చీకటి శారద, కాంగ్రెస్ పార్టీ 4, 9 డివిజన్ల అధ్యక్షులు మహ్మద్ జాఫర్, బాషబోయిన శ్రీధర్‌యాదవ్, నాయకులు నేతుల రఘు యాదవ్, శ్యాంసుందర్‌రెడ్డి, మూగల విజయ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాలాలను పరిశీలించిన ఎమ్మెల్యే, మేయర్

ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మేయర్ గుండు సుధారాణితో కలిసి హనుమకొండ చౌరస్తాలోని నాలాలను పరిశీలించారు. వ్యర్థాలతో మోరీ నిండిపోవడంపై మున్సిపల్ అధికారుల తీరుపై వారు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేల మాట్లాడుతు నాలాలన్నీ శుభ్రం చేయాలని గత కొద్ది రోజులుగా చెబుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. నాలాలన్నీ ఇలా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో నిండితే వరద నీరు ఎలా సాఫీగా వెళ్తుందని ప్రశ్నించారు. యుద్ధప్రాతిపదికన నగరంలోని నాలాలు, చిన్నపాటి మోరీలు సైతం వరద నీరు సాఫీగా వెళ్లేలా అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

మూడు నెలలకు ఒకేసారి!

జూన్‌లో బియ్యం పంపిణీకి అధికారుల కసరత్తు

- కేంద్రం ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు
- గోదాముల్లో బియ్యం నిల్వల వివరాల సేకరణ



వరంగల్ ఏనుమాములోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు చేరుకున్న సన్నబియ్యం లారీ



రేషన్‌బియ్యాన్ని పంపిణీ చేస్తున్న డీలర్ (ఫైల్)

సాక్షి, వరంగల్: వర్షాకాలంలో వచ్చే వరదలు, ప్రకృతి విపత్తులను దృష్టిలో ఉంచుకొని తిండి గింజల నిల్వ, రవాణాలో అంతరాయం తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రేషన్ పంపిణీలో రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని ఆదేశాల్లో పేర్కొనడంతో ఆ దిశగా జిల్లా పౌరసరఫరాల విభాగాధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా స్టేజీ-1, స్టేజీ -2 గోదాముల్లో మే నెల పంపిణీ పోగా ఇంకా ఎన్ని క్వింటాళ్ల బియ్యం నిల్వలున్నాయనే వివరాలు సేకరిస్తున్నారు. వీటి ఆధారంగా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ కోటాను జూన్‌లోనే పంపిణీ చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

బియ్యం నిల్వ చేసేందుకు ఇబ్బందులు..

జిల్లాలోని 13 మండలాల్లో 509 రేషన్ షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో 2,66,429 మంది కార్డుదారులున్నాయి. 7,94,087 మంది లబ్ధిదారులకు నెలకు 5,01,441 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అవసరమవుతాయి. అదేమూడు నెలల బియ్యాన్ని పంపిణీ చేయాలంటే మూడురెట్ల సన్న బియ్యం కావాలి. ఇలా పెద్ద మొత్తంలో నిల్వ చేసేందుకు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో డిమాండ్ బాగా పెరిగింది. స్టేజీ-2 గోదాముల్లో ఒక నెలకు సంబంధించిన బియ్యం నిల్వ సామర్థ్యం మాత్రమే ఉంది. మూడు నెలల బియ్యానికి ప్రత్యామ్నాయంగా ఏం చేయాలి అని ఆలోచన చేస్తున్నారు. ప్రైవేట్ గోదాముల్లో నిల్వ ఉంచాలా, వచ్చిన లారీలను దుకాణాలకు సరఫరా చేయాలా అనేదానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. చాలావరకు రేషన్ దుకాణాల్లో స్థలం తక్కువగా ఉంది. ఒక నెల బియ్యం మాత్రమే పట్టేలా గదులు ఉన్నాయి. దీంతో దుకాణాల వద్ద ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసుకోవాలని ఇప్పటికే అధికారులు రేషన్ డీలర్లకు చెప్పినట్లు తెలిసింది.

జిల్లా సమాచారం

మండలాలు	13
రేషన్‌దుకాణాలు	509
రేషన్‌కార్డులు	2,66,429
లబ్ధిదారులు	7,94,087
నెలకు పంపిణీ చేయాల్సిన కోటా	5,01,441 మెట్రిక్ టన్నులు

ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ చేస్తాం..



ఇప్పటికే మూడు నెలలకు సంబంధించి రేషన్ బియ్యం ఒకేసారి సరఫరా చేయాలని కేంద్రం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో పంపిణీ పూర్తి చేస్తాం. అయితే ఈ మేరకు క్షేత్రస్థాయిలో బియ్యాన్ని గోదాముల్లో నిల్వ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. దుకాణాల్లో బియ్యం నిల్వ ఎంత మేర సరఫరా చేయాలనేది జాబితా తయారు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం సన్నబియ్యం పంపిణీ అయ్యేలా చూస్తాం.

\- కిష్టయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖిలా వరంగల్ : వరంగల్‌లోని 32 డివిజన్ గాయత్రినగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ వల్లం పద్మ హాజరై సీసీ రోడ్డు నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. పల్లం రవి, మాజీ కార్పొరేటర్ నాగపూరి సంజయ్ బాబు, నరికె శ్రీను, రమేష్, పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

గీసుకొండ : మండలంలోని ఊకల్ సొసైటీ రైతుల కోసం పచ్చిరొట్ట ఎరువుగా వినియోగించడానికి 50 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి (ఏఓ) హరిప్రసాద్ బాబు తెలిపారు. సొసైటీ ఆవరణలో శుక్రవారం ఆయన రైతులతో మాట్లాడారు. జీలుగ విత్తనాలను తొలకరి వర్షాలకు విత్తుకుని పూత దశకు ముందు భూమిలో కలియదున్నితే భూసారం పెరిగి పంట దిగుబడి అధికమవుతుందని తెలిపారు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తాను సబ్సిడీ పోగా రూ.2137కు అందిస్తున్నట్లు చెప్పారు. మండలానికి మరో 200 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు రానున్నాయని వివరించారు. ఆసక్తి కలిగిన రైతులు భూమికి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లు ఏఈఓలకు అందించి పర్మిట్ పత్రాలు తీసుకుని విత్తనాలు పొందాలని సూచించారు. సొసైటీ చైర్మన్ బి.రమేశ్, సీఈఓ రమేశ్, కౌంటర్ ఇన్‌చార్జ్ సాంబశివరావు, పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఏసీపీ



సూచనలు ఇస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

హసన్‌పర్తి : కాజీపేట ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన పింగిలి ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిరంతరం గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారి పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ చేరాలు, ఎస్సైలు దేవేందర్, రవి, సిద్దయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

26 నుంచి జనసేవాదళ్ శిక్షణ శిబిరాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు

ఖిలా వరంగల్ : ఈనెల 26 నుంచి 31 వరకు రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరిగే జనసేవాదళ్ శిక్షణ శిబిరాలను విజ యవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో జరిగిన సమావేశానికి ఆయన హాజరై వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేశ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్‌మియా, ప్రసాద్, అశోక్, అనిల్, లక్ష్మణ్, రవీందర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



హనుమకొండ ఏసీపీకి బొకే అందజేస్తున్న హడుప్సా ప్రతినిధులు

హసన్‌పర్తి : ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బస్సులు నడపాలని హనుమకొండ ఏసీపీ నర్సింహరాములు, కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి సూచించారు. ఏసీపీలుగా బాధ్యలు చేపట్టిన నర్సింహారాములు, ప్రశాంత్‌రెడ్డిలను హడుప్సా ప్రతినిధులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హడుప్సా అధ్యక్షుడు జనార్దన్, ప్రధాన కార్యదర్శి పి.వెంకటరమణ, కోశాధికారి శంకర్, ప్రతినిధులు బుచ్చిబాబు, రవీందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, రామారావు, వెంకట్‌రెడ్డి, సతీష్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.